మన్యం జిల్లా కలెక్టర్‌గా శ్యాం ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మన్యం జిల్లా కలెక్టర్‌గా ఎ.శ్యాంప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్యాం ప్రసాద్ పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత రెండో కలెక్టర్‌గా రానున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్ జిల్లాలో రెండు సంవత్సరాలు మూడునెలలు పనిచేశారు.

పాఠశాల విద్యలో ప్రతీదీ సవాల్‌గానే మారుతోంది. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఏటా తగ్గుతోంది. హేతుబద్ధీకరణ కారణంగా పలుచోట్ల పాఠశాలలు మూతపడిన విషయం తెలిసిందే. ఫలితంగా ప్రాథమిక విద్యలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి వారంతా దగ్గరలోని ప్రైవేటు పాఠశాలలవైపు మొగ్గు చూపుతున్నారు. బోధనలో సమస్యలు, సిలబస్‌పై అస్పష్టత, హేతుబద్ధీకరణతో ఉపాధ్యాయులు, విద్యార్థుల అవస్థలు ప్రభుత్వ విద్యావ్యవస్థను చిక్కుల్లో పడేస్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు

- హేతుబద్ధీకరణే ప్రధాన కారణం
- సర్కారు బడుల మూతతో ప్రయివేటు వైపు చూపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ విద్యా విధానం, గత ప్రభుత్వ నిర్ణయాలు ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో గందరగోళం సృష్టించాయి. 2020-21లో ఉపాధ్యాయుల సన్నద్ధత, విద్యార్థుల సామర్థ్యాలను పట్టించుకోకుండా ఒకేసారి 1-6 తరగతులకు అప్పటి ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేసింది. అప్పటి వరకు తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలోకి మారాల్సి వచ్చింది. ఏటా ఒక్కో తరగతికి అమలు చేస్తూ ప్రస్తుతం పదో తరగతికి వచ్చింది. ప్రస్తుతం బడుల్లో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుల్లో ఎక్కువ మంది తెలుగు మాధ్యమంలో చదివి, ఉద్యోగాల్లోకి వచ్చినవారే. వీరికి ముందుగా శిక్షణ ఇచ్చి, వారి సామర్థ్యాలను పెంచిన తర్వాత ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేస్తే బోధన బాగుండేది. కానీ, ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అవి పెద్దగా ప్రయోజనం ఇవ్వలేదు. విద్యార్థులకు సరైన బోధన అందకపోతే ఏ భాషా సక్రమంగా రాకుండా పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2021-22 వరకు రాష్ట్ర సిలబస్‌ను అమలు చేసిన గత ప్రభుత్వం 2022-23లో ఒక్కసారిగా 8వ తరగతి వరకు సిబిఎస్‌సిలోకి మార్చింది. ఇప్పుడు ఈ విద్యార్థులు పదో తరగతిలోకి వచ్చారు. రాష్ట్రమంతా రాష్ట్ర బోర్డు పరిధిలోని అన్ని బడుల్లోనూ సిబిఎస్‌ఇ సిలబస్‌నే అమలు చేస్తుండగా.. 2025-26 నుంచి ఇంటర్నేషనల్ బకలారియట్ (ఐబి) సిలబస్‌ను అమలు చేసేందుకు గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఇదే సిలబస్ ఉంటుందో లేదోనన్న సందిగ్ధత నెలకొంది. జిల్లాలో 64ప్రభుత్వ పాఠశాలలకు సిబిఎస్‌ఇ అనుమతి ఉంది. సిబిఎస్‌ఇలో పదో తరగతిలో 20శాతం అంతర్గత మార్కులు ఉంటాయి. ఐదు సబ్జెక్టుల విధానం అమలవుతుంది. రాష్ట్ర బోర్డులో సిబిఎస్‌ఇ సిలబస్ చదివినా ఆరు సబ్జెక్టుల విధానం అమలు చేస్తున్నారు. పైగా 100 మార్కులకు పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఇది రాష్ట్ర బోర్డు విద్యార్థులకు నష్టం కలిగించనుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు చెబుతున్నారు. బైజూస్ కంటెంట్‌తో 8,9 తరగతుల విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చారు. ఆన్‌లైన్ పాఠాలు వింటున్న విద్యార్థులకు సందేహాలు వస్తే వాటిని నివృత్తి చేసే విధానం లేదు. విద్యార్థులు పాఠశాలకు వచ్చినప్పటి నుంచి తరగతుల్లో పాఠాలు వినడానికే సమయం సరిపోతుంది. రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు అదనంగా టోఫెల్ తరగతులు పెట్టారు. బైజూస్ కంటెంట్ ఉన్నా పిల్లలు పూర్తిస్థాయిలో వాడుకోలేక పోతున్నారు. ట్యాబ్‌లుపాడైనా..స్క్రీన్‌లు పగిలి పోయినా సకాలంలో మరమ్మతులు చేయడం లేదు.

తగ్గుతున్న ప్రవేశాలు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ఏటా విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. 2020-21లో 2,97,471 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే 2022-23లో 2,47,317 మంది, 2023-24లో 2,33,611 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో అన్నారు. అంటే ఏటా పదివేలకు పైగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. జీవో 117ను తీసుకొచ్చి పాఠశాలలను విలీనం చేయడమే ఇందుకు కారణం. పాఠశాలల విలీనంతో దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లలేక విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలవైపు తరలిపోతున్నారు. కరోనా సమయంలో విద్యార్థుల సంఖ్య పెరిగినా ఆ తర్వాత పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. ఒకటో తరగతిలో చేరుతున్న పిల్లల సంఖ్యా తక్కువగానే ఉంటోంది. ఏటా పదో తరగతి పూర్తి చేసి 30వేల మంది వెళ్లిపోతుండగా.. ఈ స్థాయిలో కొత్త ప్రవేశాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండడం లేదు.

హేతుబద్ధీకరణ.. విలీనాలు

వైసిపి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణ, తరగతుల విలీనాలతో మొత్తం గందరగోళం చేసింది. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల బోధనంటూ వీటిని కిలోమీటరు దూరంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా 225 పాఠశాలలు మూతపడ్డాయి. చాలా చోట్ల ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులే మిగిలాయి. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో కొన్ని ఏకోపాధ్యాయ బడులుగా మారగా.. మరికొన్ని పిల్లలు లేక మూతపడ్డాయి. 3-10 తరగతులు ఉండే ఉన్నత పాఠశాలలో 137 మంది, 6-10 తరగతులున్న బడిలో 92 మందిలోపు పిల్లలు ఉంటే ప్రధానోపాధ్యాయ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను తొలగించింది. 1-5 తరగతులు ఉండే బడిలో 30 మంది విద్యార్థుల వరకు ఒక్కరే టీచర్‌ను ఇచ్చారు. ఇలా పోస్టుల హేతుబద్ధీకరణను చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జీవో 117 రద్దు చేయాలి

గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 కారణంగా పాఠశాలలు అందుబాటులో లేక గ్రామీణ విద్యార్థులు ప్రభుత్వ బడుల నుంచి దూరవుతున్నారు. పాఠశాలల విలీనం వల్ల ప్రైవేటు పాఠశాలల్లో చేరే వారి సంఖ్య పెరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో చేరే వారి సంఖ్య తగ్గిపోతోంది. దీనంతటి కారణం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానమే. ఈ నేపథ్యంలో పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే జీవో 117 ను రద్దు చేయాలి.

- ఎస్.మురళీమోహనరావు, యుటిఎఫ్ మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి,

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజారోగ్యం వైఫల్యం చెందితే

ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజా ఆరోగ్యం కుటుంబ ఆర్థికవ్యవస్థపై ప్రభావం చూపుతుందని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుంచి రెవెన్యూ, ప్రజారోగ్యం, పారిశుధ్యం, మంచినీరు సరఫరా, మహిళాశిశుసంక్షేమం తదితర అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు అంశాల వారీగా సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మ్యుటేషన్లను రెండురోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు ఒకే సమస్యను తరచూ అందిస్తున్నారని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని, కారణం లేకుండా సమస్యపై అలసత్వం వహించినట్లైతే అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్యానికి సంబంధించి విద్య, వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ, తాగునీరు పారిశుధ్య శాఖ, పట్టణ అభివృద్ధి, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు అనారోగ్యం పాలైతే వారు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, వారి జీవనప్రమాణాలు కూడా దెబ్బతింటాయని తెలిపారు. కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు పరిశుద్ధమైన నీరందించాలని, నిబంధనల మేరకు తనిఖీలు, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. శానిటేషను ప్రక్రియ సక్రమంగా జరగాలని, కాలువల్లో పూడికతీత పనులు, లార్వా వృద్ధిచెందకుండా చర్యలు తీసుకోవాలని, స్ప్రేయింగు, ఫాగింగు షెడ్యూలు ప్రకారం చేయాలని, దోమల జీవిత చక్రం పూర్తికాకుండా ఇటువంటి చర్యలు తీసుకోవడం వల్ల దోమలను నివారించవచ్చునని తెలిపార్చు.తాగు నీరు, మురికి నీరు కలుషితం కావడం వల్ల అతిసార ప్రబలుటకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని, వాటిని పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో, పాఠశాలలో చేతులు శుభ్రతపై చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని అన్నారు. నరేగా పనులకు సంబంధించి లక్ష్యాలను పూర్తిచేయాలని తెలిపారు. సాగునీటి పారుదల కాలువల్లో తుప్పలు పెరిగిపోయి నీటి పారుదలకు ఆటంకం కలుగుతున్నట్లు రైతుల నుంచి పలు ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలో 322 కిలోమీటర్లు పొడవైన 166 కాలువలో పనులు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, వెంటనే పనులు చేపట్టి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి ఒ.ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎంఎన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శివకుమార్

పిహెచ్‌సిల్లో మందుల కొరత

ప్రజాశక్తి - సాలూరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా జ్వరాలకు కొంతమేర మందుల కొరత వుందని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శివకుమార్ చెప్పారు. మంగళవారం ఆయన స్థానిక ఏరియా ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారితో కలిసి ఆయన పరామర్శించారు. విద్యార్థినిల వద్ద ఉన్న వార్డెన్ రోజారాణితో ఆయన మాట్లాడారు. ఎక్కువ మంది విద్యార్థినిలు అనారోగ్యానికి గురైనప్పుడు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారికి సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. హాస్టళ్లలోనే చికిత్స అందించి జ్వరాలు తగ్గించవచ్చునని చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా మందుల కొరత కొంత మేర ఉందన్నారు. క్లోరోక్విన్, ప్రైమాక్విన్ మాత్రలు మాత్రమే వున్నాయని చెప్పారు. ఆర్టిసినేట్ ఇంజెక్షన్ల సరఫరా లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాలని వైద్యులు చెపుతున్నారని డాక్టర్ శివకుమార్ చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని

మంత్రికి పలు సంఘాల వినతి

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సాలూరు, పాచి పెంట ఐసిడిఎస్ ప్రాజెక్టుల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె నివాసంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, పాచి పెంట నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు మంత్రి సంధ్యారాణిని కలిసి సమస్యల్ని వివరించారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జారీ చేసిన జీవో అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శశికళ, గౌరీశ్వరి, పద్మావతి పాల్గొన్నారు.

స్వీపర్లు వినతి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. చాలీచాలని జీతాలతో పని చేస్తున్నందున కనీస వేతనం రూ.12 వేలు చేయాలని కోరారు. ప్రస్తుతం 4వేలు, నాడు- నేడు పాఠశాలల్లో రూ.6వేలు జీతం చెల్లిస్తున్నారని చెప్పారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పద్మ, రామలక్ష్మి వున్నారు.

మంత్రికి వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విఆర్‌ఎల వినతి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా విఆర్‌ఎల సంఘం నాయకులు మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణాలో మాదిరిగా విఆర్‌ఎలకు టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖలో రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన విఆర్‌ఎలను నైట్ వాచ్‌మెన్, అటెండర్లుగా తీసుకోవాలని, విఆర్‌ఒలు గా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు, కార్యదర్శి జి.కృష్ణా రావు, కోశాధికారి ఎస్.పాపారావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో రాజకీయ జోక్యం తగదు

వైసిపి హయాంలో వాలంటీర్లే ఇచ్చారు : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

సామాజిక పింఛన్లను టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎలా పంపిణీ చేస్తారని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ప్రశ్నించారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు కాని టిడిపి నాయకులు, కార్యకర్తలతో సామాజిక పింఛన్ల పంపిణీ ఎలా చేయిస్తారని అన్నారు. స్థానిక సర్పంచ్‌లు, ఎంపిపిలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్ల ద్వారా కాకుండా సాధారణ కార్యకర్తలతో పంపిణీ చేయించడం ప్రోటోకాల్ ఉల్లంఘన అవుతుందని చెప్పారు. ఒకవేళ టిడిపికి చెందిన సర్పంచులు, ఎంపిపి లు, మున్సిపల్ చైర్మన్లు వుంటే వారి ద్వారా పంపిణీ చేసుకోవచ్చునని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ నాయకులు, కార్యకర్తలతో పింఛన్లు పంపిణీ చేయించలేదని చెప్పారు. గ్రామ, వార్డు వాలంటీర్లే పంపిణీ చేశారని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా సంక్షేమ పథకాలు పంపిణీ చేయకపోవడం వల్లనే వైసిపి గత ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదుర్కొన్నదని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. 2014లో టిడిపి ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా పంపిణీ చేయించినట్లు ఇప్పుడు కూడా అదే విధానాన్ని అమలు చేస్తోందని చెప్పారు. మెంటాడ మండలం చామలాపల్లి సర్పంచ్‌పై టిడిపి నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించిన తీరుపై విజయనగరం జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రజలంతా ఎటువంటి ఇబ్బంది లేకుండా సమస్యలు పరిష్కారించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలన్నారు, ముఖ్యంగా తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, పురుగుల మందులు అందేలా చూడాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని అన్నారు. సమావేశంలో తహశీల్దారు వరహాలు, ఎంపిడిఒ రామకృష్ణ, టిడిపి జిల్లా కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామానాయుడు, తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పౌష్టికాహారం పగడ్బందీగా అమలు చేయాలి : ఎమ్మెల్యే

సీతంపేట : అంగన్వాడీల ద్వారా ఏజెన్సీలో గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అమలు చేయాలని అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పౌష్టికాహారం అందించాలన్నారు. సిడిపిఒ పి.రంగలక్ష్మి సిబ్బంది కొరత ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. నాడు-నేడు జరిగిన పనులు నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. కొన్ని స్కూళ్లు బాగోలేదన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై సకాలంలో గిరిజన రైతులకు అందించాలన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా నిర్మించిన 23 గోకులాలు ఒక్కొక్క యూనిట్ రూ.22 లక్షలు మంజూరు చేసినట్టు ఎడి శ్రీనివాసరావు తెలిపారు. ఫిష్షింగ్ యూనిట్లు ఎక్కడా సరిగ్గా పెంచడంలేదని అన్నారు. గిరిజన గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందన్నారు. సోలార్ కాంట్రాక్టర్‌కు తెలియజేసి మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ గీతాంజలి, తహశీల్దార్ మహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కృష్ణకుమార్, జెఇ పాపారావు, వెంకటేష్, ఇఒపిఆర్‌డి కె.సత్యం, ఎపిఎం విజయకుమారి, ఎపిఒ సాగర్, జిసిసి మేనేజర్ కృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం, ఐటిడిపి మండల కోఆర్డినేటర్ ఇమరక పవన్, కూటమి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లి ఆశ్రమ పాఠశాలలో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

మండలంలోని మల్లి ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులకు నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ దుప్పట్లు, ఇతర సౌకర్యాలు అన్ని ప్రభుత్వం కల్పిస్తుందని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వం ఉచితంగా చదివిస్తుందని, దీన్ని వినియోగించుకోవాలని అన్నారు. గిరిజన విద్య కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు, ఎఎంపి పి.కోటిబాబు, హెచ్‌ఎం ఎవి శ్రీనివాసరావు, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

జిల్లాలో ఫించన్లు పంపిణీ 98శాతం పూర్తయిందని, శతశాతం పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఫించన్లు పంపిణీపై సమీక్ష నిర్వహించారు. శతశాతం పంపిణీ పూర్తిచేసి నివేదిక సమర్పించాలని ఎంపిడిఒలను ఆదేశించారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - మక్కువ

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని, రెండు పూటలా పని రద్దు చేయాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, రూ.400 కూలి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద వేతనదారులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, గిరిజన సంఘం జిల్లా నాయకులు టి.ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసిన 14 రోజుల్లో బిల్లులు చేయాలని చట్టంలో వున్నప్పటికీ గత 5 వారాల నుంచి బిల్లులు చేయలేదని, 7 నెలల నుంచి వ్యవసాయ పనుల్లేక, ఇటు ఉపాధి బిల్లులు కాక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఎన్నికల ముందు బిల్లులు చేసినట్లు ఎన్నికలు అయిన తర్వాత బిల్లులు చేయడం లేదని అన్నారు. అలాగే వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతున్న కొద్దీ వ్యవసాయ పనిదినాలు తగ్గిపోతున్నాయని అన్నారు, అందుకని ప్రభుత్వం 200 రోజులు పని దినాలు పెంచి, రూ.400 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ కిట్లు, టెంట్లు, మంచినీరు, మజ్జిగ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పార, పలుగు, తట్టల నిర్వాహణ కోసం డబ్బులు వేయాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు అడ్డమేశ్వరావు, వెంకటరావు, రమేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి హనుమాన్ జంక్షన్ వరకు మంగళవారం డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద పరిశుభ్రత పాటించాలని, మురుగు నీరు నెలలు లేకుండా చూసుకోవాలని వైద్యాధికారి పి.పావని తెలిపారు. కార్యక్రమంలో పిఎన్ఎస్ డి.సత్యవతి, సిహెచ్ఒ ఎస్.రమణ, హెల్త్ అసిస్టెంట్లు సూపర్వైజర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామ దళితులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖ వారు గ్రామాల్లో దళితులకు, గిరిజనులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దళితులపై భౌతిక దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని కోరారు.

బంద్‌కు మద్దతు

నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన తప్పిదాలపై ఈనెల 4న ఎస్ఎఫ్ఐ తలపెట్టిన బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రంజిత్ కుమార్ తెలిపారు. కనీసం పార్లమెంట్‌లో చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడకపోవడం అప్రజాస్వామిక చర్య అని రంజిత్‌కుమార్ అన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పలగర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ-1 సామల సింహాచలం మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు అందరికీ అందినది లేనిది పరిశీలించారు. నూతన విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థులతో ముచ్చటించారు. విద్యా ప్రవేశం కార్యక్రమాలు ప్రతి రోజు అమలు చేయాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల కొరకు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంబాబు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 24వ వార్డులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు మంగళవారం పింఛన్ లబ్ధిదారులతో కలిసి టిడిపి, జనసేన కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా హామీ నెరవేర్చినందుకు నెలకు రూ.4వేలకు పెంచినందుకు గానూ, ఏప్రిల్ నుంచి బకాయిలతో పాటుగా లబ్ధిదారులకు మొత్తంగా రూ.7వేలు పింఛను అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు మహిళలు, వృద్ధులు, పింఛన్ లబ్ధిదారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేసి కేకులు కట్ చేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.

వంతెనకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

బ్రిటీష్ కాలం నాటి శిథిలావస్థకు చేరిన జంఝావతి నదిపై నిర్మించిన కోటిపాం బ్రిడ్జిపై మరమ్మతు పనులు చేపట్టి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వెంటనే చేయాలని సిపిఎం నాయకులు సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బ్రిటీష్ వారు 1933లో నిర్మించిన ఈ వంతెన నేటికి 91 ఏళ్లు అయినా మరమ్మతు పనులు చేపట్టకపోవడం, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకపోవడం అన్యాయం అని అన్నారు. ఈ వంతె పై నుంచి ప్రతిరోజు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, ఆ సమయంలో వంతెన కదులుతుండడంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ వంతెన విషయంలో ఏమైనా జరగరాని సంఘటన జరిగితే మూడు రాష్ట్రాలకి వెళ్లే వాహనదారులు, ప్రయాణికులతో పాటు కొమరాడ మండలంలోని అనేక గ్రామాలకు చెందిన ప్రయాణికులతో పాటు విద్య, వైద్యం, రవాణా సౌకర్యం లేక చాలా ఇబ్బంది పడే పరిస్థితి నెలకొందన్నారు. కావున వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం నాయకులు

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సీతానగరం

మండలం చినభోగిలికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గుణుపూరు వాసు గత నెల తాపీ పని చేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచి పనులకు వెళ్లలేక పోతున్న కారణంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఉద్దేశ్యంతో శ్రీ వేణుగోపాల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు తోలాపు రమేష్, శనపతి కృష్ణ సీతానగరం మండల కమిటీ సభ్యులు రంకిరెడ్డి శంకర్రావు, టుంపిళ్లి వెంకటరమణ, సారిక గోపి తదితరులు వాసుకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

పాఠ్యాంశాలు సులభతరంగా ఉండాలి

గరుగుబిల్లి : పిల్లలకు అర్థమయ్యేలా, మనస్సుకు హత్తుకునేలా పాఠ్యాంశాలు సులభతరంగా ఉండాలని పొలం బడి సిలబస్ డివలప్మెంట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ భవనంలో మంగళవారం రచయితలతో వర్క్ షాపు రైతు సాధికార సంస్థ బడి నుండి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పుడే మనం చేసే ప్రయత్నాలు సఫలీకృతమవుతాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు ప్రకృతి వ్యవసాయ వాచకాలు పరిచయం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడం జరుగుతుందన్నారు. డిపిఎం పి షణ్ముఖ రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత ప్రతి రైతు, ప్రతి వ్యక్తులపై ఆధారపడి ఉందని, ఇప్పటి నుంచే క్రమం తప్పకుండా చేయడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలన, ఆరోగ్యకరమైన వాతావరణం, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభించడం, ఆరోగ్యాలు కాపాడుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రచయితలు ఆర్.వాసుదేవరావు, టి.శివకేశవరావు, బెలగాం భీమేశ్వరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వర్క్‌షాపులో పాల్గొన్న రచయితలు

రేపు విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - కురుపాం

బంద్ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఈనెల 4న దేశవ్యాప్త విద్యార్థి సంఘాలు చేపట్టబోయే బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం కురుపాంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి బంద్‌కు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో, బాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని వెంటనే నీట్ పరీక్షను రద్దు చేయాలని నీట్ పరీక్షా లీకేజ్ తెరవెనుక కుంభకోణం, నీట్-పిజి పరీక్షను 12గంటల ముందు వాయిదా వేయడం, యూజిసి నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని అన్నారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని, దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్య పరిస్థితి కూడా దారుణంగా ఉందని అన్నారు. బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గిందన్నారు. 2018-19, 2021-22 మధ్య దేశంలో 61,885 పాఠశాలలు మూసివేశారని వాపోయారు. ఎన్‌టిఎ వ్యవస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, పిహెచ్‌డి అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నీట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, ముంబై ఐఐటి నుండి హైదరాబాద్, సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘ నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు యూనివర్సిటీలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేత చర్యలు ఆపాలని కోరారు. దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేతను ఆపాలని, నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా జులై4న దేశ వ్యాప్తంగా కెజి నుండి పిజి వరకూ విద్యాసంస్థల బంద్‌కు ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపునివ్వడం జరిగిందని, ఈ బంద్‌లో అన్ని విద్యా సంస్థలు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బుగ్నేష్, గౌతమ్, శ్రీను, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

అనధికారికంగా ఒడిశా సరిహద్దు గ్రామాలకు తరలుతున్న సుమారు రూ.11వేల విలువ గల 28 బస్తాల ఎరువులను సీజ్ చేసినట్లుగా మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. 15 బస్తాలు ఎరువులు మన గ్రోమోర్ సాలూరు నుంచి తీసుకు వెళ్తున్నట్లుగా, 13 బస్తాలు ఎరువులు పాచిపెంట మండలంలోని ఆత్మకూరు శ్రీనివాసరావు అనే వ్యక్తి నుండి తీసుకెళ్తున్నట్టుగా ఒరిస్సా రైతులు తెలిపారు. ఈ బస్తాలను రోడ్డవలస గ్రామం సరిహద్దుల్లో పట్టుకున్నామని, వీటిని పొట్టంగి మండలానికి చెందిన కందిలి, పేటూరు గ్రామాలకు తీసుకెళ్తున్నట్టు తెలిపారు. వీరి వద్ద ఎలాంటి బిల్లులు లేని కారణంగా వాటిని పంచనామా చేసి పి.కోనవలస రైతు భరోసా కేంద్రంలో భద్రపరిచినట్టు ఎఒ తెలిపారు. ఈ సందర్భంగా పాచిపెంట మండలం వర్తకుడు ఆత్మకూరు శ్రీనివాసరావును ప్రశ్నించగా అది నిజమేనని, వారికి వ్యవసాయ నిమిత్తం డబ్బు పెట్టుబడి పెడతానని, ఇకపై కేవలం డబ్బు మాత్రమే ఇస్తానని తెలిపారు. ఎరువులు, పురుగుమందులు ఇవ్వనని తెలియజేశారు. మన గ్రోమోర్ సాలూరు నుంచి ఒడిశా గ్రామాలకు తరలి వెళ్తున్న కారణంగా మన గ్రోమోర్ సెంటర్లో ఎరువులను వ్యవసాయ అధికారి, సహాయ వ్యవసాయ సంచాలకులు నిలిపివేశారు. ఈ విషయమై ఎరువుల విక్రేతలకు సమావేశం నిర్వహించి చట్ట ప్రకారం తీవ్ర చర్యలు తీసుకోబడతాయని, లైసెన్సులు కూడా రద్దు చేయబడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో విఎఎలు మోహన్ కృష్ణ, వినోద్, కిరణ్ పాల్గొన్నారు.

కొత్త చట్టాలు కఠినతరం : సిఐ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఇప్పటి వరకు అమల్లో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేస్తూ కొత్త నేర చట్టాలు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బి ఎం ఎస్ ఎస్), భారతీయ సాక్ష్య అధినయం (బిఎస్ఎ) జులై 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. కొత్త నేర చట్టాలపై గ్రామాల్లో ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చినమేరంగి సిఐ బి.మంగరాజు వెల్లడించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి స్థానిక విలేకరులతో మాట్లాడారు. అమల్లోకి వచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలతో కేసుల దర్యాప్తు వేగవంతం కావడంతో పాటు విచారణ వేగం పెరిగి సత్వర న్యాయం అందుతుందన్నారు. క్రిమినల్ కేసుల్లో విచారణ ప్రారంభమైన తర్వాత 60రోజుల్లోగా అభియోగాలు మోపాల్సి ఉందన్నారు. విచారణ పూర్తయిన 45 రోజుల్లో తీర్పులు వెలువడనున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా బాధితులు ఇకపై నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. బాధితులతో పాటు నిందితులకు కూడా ఎఫ్ఐఆర్ కాపీ నకలను ఉచితంగా అందజేయనున్నారు. ఈమేరకు అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాలపై ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని సిఐ పేర్కొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం : డిఎంఒ

ప్రజాశక్తి - కొమరాడ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్మోహన్‌రావు ఆదేశించారు. మంగళవారం కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ఏఏ గ్రామాల్లో సీజనల్ జ్వరాలు నమోదవుతున్నాయి, అక్కడ ఏ విధమైన నివారణ చర్యలు చేపడుతున్నారు, అందచేస్తున్న చికిత్స తదితర అంశాలపై ఆయా గ్రామలవారీగా సిబ్బందిని ఆరా తీశారు. జ్వర నిర్ధారణ పరీక్షలు క్షేత్ర స్థాయిలో నిర్వహించాలని, జ్వరపరీక్షల కోసం ప్రజలు ఆసుపత్రి ప్రయాస పడి వచ్చే పరిస్థితి ఉండకూడదన్నారు. గ్రామాల్లో సీజనల్ మలేరియా, డెంగీ తదితర సీజనల్ జ్వరాలు సకాలంలో గుర్తుంచడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు ఆ పరిధిలో ఉండే వెల్నెస్ కేంద్రాల ద్వారా వైద్య సేవలు ఆందించాలన్నారు. స్టాప్ డయేరియా కాంపెయిన్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఒఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా శిశువులు, గర్భిణీల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలోనూ, ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసారు. అనంతరం డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా అవగాహన పిహెచ్‌సి ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ టి.గణేష్ పట్నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ధనుంజయ కుమార్, సిహెచ్ఓ బంగారు బాబు, సూపర్ వైజర్స్ శోభ, కృష్ణ శారద, బద్రి నారాయణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని అడపా దడపా కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, వీటిలో దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పి.ఉమ మహేశ్వరి ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాల్లో సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్కడైనా అధికంగా జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నట్లు తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని, ప్రజలకు అందుబాటు లో ఉండి మెరుగైన వైద్యం అందేలా బాధ్యత వహించాలని అన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో గర్భిణీలను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధిక టీకాలు పడేలా చూడాలన్నారు. గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహార అందేలా చూడాలన్నారు. గర్భిణులను ప్రతినెలా ఆసుపత్రికి తనిఖీల కోసం తీసుకురావాలని ఆశా కార్యకర్తలను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఒ.శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న శ్రీకృష్ణ సేవా సంఘం ప్రతినిధులు

హామీలను నెరవేర్చిన సిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని ఘనత ఆయనకే దక్కుతోందని పట్టణ పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కూరాకుల వీధిలో శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో హామీలు చూశామె తప్ప అందరికీ పూర్తిస్థాయిలో సంక్షేమం ఫలాలు అందలేదని ఆయన అన్నారు. ఇప్పటికీ కొంతమంది మహిళకు చేయూత డబ్బులు పడలేదని వాపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వా ,తాతలకు రూ.4000తో పాటు అదనంగా మరో మూడు వేల రూపాయలు కలిపి పింఛను పంపిణీ చేస్తానన్న హామీ నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. ఈ ఐదేళ్లలో అనేక సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ కష్ణ సేవా సంఘ నాయకులు లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జామి సింహాచలం, కర్రి నాగభూషణరావు, కోట త్రినాధ, శంకర్, అప్పడు, పరిసయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణలో జగన్ విఫలం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో గిరిజన హక్కులను కాపాడడం లో జగన్ ప్రభుత్వం విఫలమయిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఒక ప్రకటనలో విమర్శించారు. మంగళవారం పార్లమెంటులో అరుకు ఎంపీ డాక్టర్ తనూజా రాణి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ మంత్రి సంధ్యారాణి మాట్లాడారు. జీవో 3ను రద్దు చేసి నాలుగేళ్ళు అవుతున్నా వైసిపి ప్రభుత్వం పట్టించుకోదన్నారు. సైకో జగన్ పాలనలో గిరిజనులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని ఆరోపించారు. గిరిజనుల జీవనవిధానంలో భాగమైన పోడు వ్యవసాయాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. సబ్సిడీపై గిరిజనులకు అందాల్సిన ట్రైకార్ రుణాలు, పని ముట్ల పంపిణీ నిలిపివేసిందని సంధ్యారాణి పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో ఉన్న పెద్దమడి బాలుర గురుకుల కళాశాలలో మిగిలిన సీట్లకు మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఈనెల 8లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 9న పెద్దమడి బాలుర గురుకుల కళాశాల కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. విద్యార్థులు హాజరు కావాలన్నారు. మెరిట్ మార్కులు ప్రాధాన్యంతో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎంపిపి, బైపిసి, సిఇసి గ్రూపుల్లో సీట్లు ఉన్నాయన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి పింఛను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

ఆస్పత్రిలో పింఛను పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

విశాఖలోని అనిల్‌నీరుకొండ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని తొమరాడకు చెందిన యామల దీనమ్మకు వితంతు పెన్షన్‌ను టిడిపి అరకు పార్లమెంట్ నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బి.రవికుమార్ సమక్షంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంగపండు చంద్రశేఖర్ మంగళవారం అందజేశారు.

వీరఘట్టం: గ్రామంలోని ఒకటో సచివాలయం పరిధిలోనే కూరాకులవీధికి చెందిన కోట దుర్గారావు విజయనగరం జిల్లా కేంద్రంలో వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్‌తో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు డిజిటల్ సహాయకులు సింహాచలంకు విషయం తెలియజేయడంతో విజయనగరంలో దుర్గారావు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి మంగళవారం వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

గరుగుబిల్లి: అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి గరుగుబిల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పూడి మన్మథరావు మంగళవారం ఉదయం వృద్ధాప్య పింఛన్ను మండల కేంద్రానికి చెందిన నల్ల శ్రీరాములునాయుడు అనారోగ్యం కారణంగా విశాఖ పట్నంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకి పింఛన్ అందజేశారు .

చెరువుల రక్షణ అభినందనీయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చెరువులు, గెడ్డలు తదితర నీటి వనరుల సంరక్షణకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర చేపట్టిన చర్యలు అభినందనీయమని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు జాగారపు ఈశ్వర రావు, జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, ఉపాధ్యక్షులు రేజేటి దయామణి, బలగ శంకర్రావు తదితరులు అన్నారు. మంగళవారం పట్టణంలోని నెల్లిచెరువు, వరహాల గెడ్డ, దేవుడి బంద, బిళ్ళ బంద, లంకెల చెరువు తదితర నీటి వనరుల్లో జరిగిన ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి పార్వతీపురంలో చెరువులు, వరహాలు గెడ్డ కబ్జాకు గురయ్యాయన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ తదితరులు ఆక్రమణలు అడ్డుకునే చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో విధి నిర్వహణలో అలసత్వం వహించిన జిల్లా కలెక్టర్ నుండి విఆర్ఒ వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వరహాలు గెడ్డలో జరిగిన కబ్జా ప్రాంతాన్ని పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపల్ అధికారులు చేపట్టిన ఆక్రమణ తొలగింపు పనులను పరిశీలించారు. అలాగే నెల్లిచెరువు, లక్ష్మినాయుడు చెరువుల్లో కబ్జాల వెనుక రాజకీయ పెద్దల హస్తం ఉందని, వాటిని రక్షించాలని కోరారు. చెరువుల్లో రాజ్యమేలుతున్న దొంగ పట్టాలపై, నిర్మాణాలకు విద్యుత్ సౌకర్యం కల్పించిన ఆ శాఖ అధికారులపై, పక్కా భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన మున్సిపల్, పంచాయతీ అధికారులపై దర్యాప్తు నిర్వహించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికారులు పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొండబారిడిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండశిఖర గ్రామాలకు లింకు రోడ్లు వేయాలని, ఏనుగుల సమస్యను పరిష్కరించాలని, జీడీ రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి, ఇళ్ల స్థలాల పోరాటం కొనసాగించాలని, గెడ్డలు, సెలయేరులపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలని, గిరిజన రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో వీటి సాధనకు ప్రజలను సమీకరించి ఉద్యమించాలని అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు, సింగన్న, పి.మోహన్‌రావు, త్రిమూర్తులు తదితర పాల్గొన్నారు.

ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షుడ్ని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ

శ్రీకాకుళం ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరామ్‌కు ఇటీవలే శ్రీకాకుళం మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి లభించడంతో మంగళవారం పాలకొండ డివిజన్ ఎన్‌జిఒ యూనిట్ నాయకులు శ్రీకాకుళం మెడికల్ కళాశాలలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పాలకొండ డివిజన్‌లో ఎన్‌జిఒ సంఘం బలోపేతానికి కృషి చేయాలని సాయిరామ్ కోరారు. కొత్త ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాథం, అధ్యక్షులు రంగాచారి, కార్యదర్శి పైల ఈశ్వరరావు, రమేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

చిదిమిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని చిదిమిలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సరస్వతి, ఎంఎల్ హెచ్పి అనూష, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

అధికారులతో నేడు ఎమ్మెల్యే సమీక్ష

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 3న మండల స్థాయి అధికారులతో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మండల స్థాయి అధికారులంతా సమయం పాటించి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 3న హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, గర్భాన సత్తిబాబులు, ప్రత్యేక ఆహ్వానితులు కళాశాల ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాథ్, ఎస్సై జి కళాధర్, వైస్ ప్రిన్సిపల్ మాచర్ల కుమారస్వామి, విజయవాడకు చెందిన హెల్పింగ్ హేండ్స్ ఫౌండర్ ఎం.శివరామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామంత పూడి చైతన్య, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు యవర్ణ శేఖర్, పాలకొండ నియోజకవర్గ అధ్యక్షులు వారాడ రాజశేఖర్, న్యూ హెల్పింగ్ హేండ్స్ ఫౌండర్ శైల పద్మరాజు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్యం, తాగు నీటిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్యం, తాగునీరుపై ప్రత్యేక దృష్టి పెట్టమని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం కలెక్టర్ నిశాంత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల్లో అమలవుతున్న పథకాల గురించి ఆరా తీశారు. ప్రజా ఆరోగ్యం కుటుంబ ప్రజారోగ్యానికి సంబంధించి విద్య, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, తాగునీరు పారిశుధ్య శాఖ, పట్టణ అభివృద్ధి, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు అనారోగ్యం పాలైతే వారు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, వారి జీవనప్రమాణాలు కూడా దెబ్బతింటాయని తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న చర్యలతో నగరంలో దోమలు తగ్గడం గమనించడమైందని, ఇదే స్ఫూర్తిని ఏడాది పాటు కొనసాగిస్తే మార్పు కనబడుతుందని తెలిపారు. కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శానిటేషను ప్రక్రియ సక్రమంగా జరగాలని, కాలువల్లో పూడికతీతపనులు, లార్వా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని, స్ప్రేయింగ్, ఫాగింగు షెడ్యూలు ప్రకారం చేయాలని, దోమల జీవిత చక్రం పూర్తికాకుండా ఇటువంటి చర్యలు తీసుకోవడం వల్ల దోమలను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ రమేష్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ నవీన్ కుమార్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎపిఒ బాలకృష్ణ , ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఉన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ఒకటో వార్డు ఒరియా పండా వీధిలో ఉన్న 3వ రిజర్వాయర్ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ మరమ్మతు పనుల కారణంగా ఈనెల 3న తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇంఛార్జి కమిషనర్ శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 1,2,3,4,5,6,7 వార్డులో తోపాటు 28,29 వార్డుల లో తాగునీటి సరఫరా వుండదని ఆయన చెప్పారు.

జాతీయ మహాసభలకు రంజిత్‌కుమార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 14న బెంగళూరులో జరగనున్న జన విజ్ఞాన వేదిక జాతీయ మహాసభలకు వేదిక రాష్ట్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ హాజరౌతున్నారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ సైన్సు ఫలాలు మన్యం ప్రజలకు అందాలన్నారు. మన్యంలో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడానికి వేదిక పనిచేస్తోందని వివరించారు. మూఢనమ్మకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని అన్నారు.